## క్లుప్తంగా

### ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు బుధవారం 17వ రోజుకి చేరుకున్నాయి. ఉదయం 8.10 గంటలకు పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజాగ్రహానికి గురి కాక తప్పదు



దీక్షా శిబిరంలో పాల్గొన్న సిటు నేత రాజు

సీతమ్మధార : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం బుధవారానికి 1243వ రోజుకి చేరుకుంది. ఈ మేరకు సిటు జగదాంబ జోన్ ఆధ్వర్యంలో వై.రాజు అధ్యక్షతన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకుడు కె.చంద్రమోహన్ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ వద్ద జరిపిన సమావేశంలో ప్రైవేటీకరణ చేయనివ్వం అని హామీ ఇచ్చి కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ నిలబెట్టుకోకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకులు ఎం.సుబ్బారావు, టి.కామేశ్వరరావు, చంద్రమౌళి, బంగారు నాయుడు, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రి బాబు, ప్రకాష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

### చవితికి రాట ఉత్సవం



రైతుబజార్ వద్ద రాట ఉత్సవం నిర్వహిస్తున్న కనకరెడ్డి తదితరులు

జగదాంబ : రామకృష్ణా రైతుబజార్ వద్ద వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి రాట మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకరెడ్డి, రైతుబజార్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్కెట్ వద్ద చవితి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా పూజ చేస్తున్నామని, ఈ మేరకు రాట ఉత్సవం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ అసరినాయుడు, సెక్రటరీ కనకరాజు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గురుకుల ప్రవేశాల్లో జిల్లా ఫస్ట్ ర్యాంక్



ఫస్ట్ ర్యాంకర్ మిథినేష్‌ను సత్కరిస్తున్న మండల విద్యా శాఖాధికారులు

మద్దిలపాలెం: గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ స్కూల్ విద్యార్థి సీహెచ్ మిథినేష్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో మిథినేష్‌ను సీతమ్మధార మండల విద్యా శాఖాధికారి-1 రామారావు, విద్యా శాఖాధికారి-2 బాలామణి ఘనంగా సత్కరించారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 6వ తరగతిలో ప్రవేశానికి మిథినేష్ పరీక్ష రాసి జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించడం గర్వకారణమని కొనియాడారు.



# నాడు ఘనం.. నేడు దయనీయం

పాత నగరం.. ఎంతో రాజకీయ చైతన్యం ఉన్న ఈ ప్రాంతం బ్రిటిష్ కాలం నుంచి చైతన్యవంతమైనది. అప్పట్లోనే ఇక్కడ తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా కార్యాచరణ, సమావేశాల నిర్వహణ వంటి వాటిని స్థానిక సమరయోధులు నిర్వహించేవారు. తర్వాతి కాలంలో ఇదే విశాఖ తొలి నగరంగా ఖ్యాతికెక్కింది. అయితే తర్వాతి కాలంలో నగరం విస్తరించి పాతనగరం నిర్లక్ష్యానికి గురయింది. దాంతో ఈ ప్రాంతం ఓల్డ్‌టౌన్‌గా పిలవబడుతూ ఎలాంటి అభివృద్ధికి నోచుకోక అభివృద్ధిలో వెనుకబడిపోయింది.



శిథిలమైన అగ్నిమాపక శాఖ కార్యాలయం.. ఫైరింజన్



ప్రస్తుతం ఎలాంటి కార్యకలాపాలు జరగని పాత పోస్టాఫీసు స్థలం



నిరుపయోగంగా మారిన రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన క్వీన్‌మేరీ పాఠశాల

- నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ కార్యాలయాలు
- స్పందించని సంబంధిత శాఖాధికారులు

జగదాంబ : ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పాతనగరం ఇప్పుడు పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెలవెలబోతోంది. ఇక్కడి ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, స్థలాలు శిథిలమై నిరుపయోగంగా మిగిలాయి. నిజానికి పూర్వం నగరం అంటే ఇదే. తర్వాతి కాలంలో విశాఖ విస్తరించింది. దాంతో పాతనగరం వెనుకబడిపోయింది. జిల్లాకే మొదటి కార్యాలయంగా గణతికెక్కిన అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఆ శాఖ వాహనాలు కొన్ని ఇక్కడ ఇప్పటికీ తుప్పు పట్టి కనిపిస్తాయి. అదే విధంగా రిజిస్ట్రార్ కార్యాలయం కూడా పాడుబడిపోయింది. పాత పోస్టాఫీసు, క్వీన్‌మేరీ పాఠశాల వంటివన్నీ గత వైభవాన్ని కోల్పోయి నేడు నిర్లక్ష్యానికి నిలువుటద్దాల్లా కనిపిస్తున్నాయి.

**జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం..**

పాతనగరంలోని మరో పురాతన ప్రభుత్వ కార్యాలయం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం. ఒకప్పుడు ఇది ఎంతో హడావుడిగా ఉండేది. ఇక్కడ వేల సంఖ్యలో లావాదేవీలు జరిగేవి. ఇప్పుడు ఇది నిస్తేజంగా మారిపోయింది. వాస్తవానికి ఈ స్థలం ఆర్ అండ్ బి ఆధీనంలో ఉన్నప్పటికీ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించి నగర ప్రజల సేవల కోసం కేటాయించారు. తర్వాతి కాలంలో గాజువాక, మధురవాడ, అక్కయ్యపాలెం, భీమిలి వంటి ప్రాంతాల్లో రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాతనగరంలోని రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. అదే విధంగా ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించిన క్వీన్‌మేరీ పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకుంది. 850 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు అదనపు గదులు నిర్మించి.. ఆధునీకరిస్తే ఎంతో మందికి ఉపయోగపడుతుందని స్థానికులంటున్నారు.

**పాత పోస్టాఫీసు..**

పాత పోస్టాఫీసు అంటే నగరంతో పాటు పక్క జిల్లాల ప్రజలకు కూడా తెలిసిన ప్రాంతం. వందేళ్లకు పైగా సేవలందించిన ఈ ప్రభుత్వ కార్యాలయం నేడు మూగబోయింది. ఇక్కడ ఇప్పుడు ఎటువంటి కార్యకలాపాలు జరగడం లేదు. ఒకప్పుడు నిత్యం బిజీగా ఉండే ఈ కార్యాలయం శిథిలమైన మొండి గోడలు, తుప్పు పట్టిన ఇనుప గేటుతో దెయ్యాల కొంపలా దర్శనమిస్తూ భీతిగొలుపుతోంది.

### పాలకుల్లో చిత్తశుద్ధి లేదు..



నిజానికి పాతనగరంలో అభివృద్ధి చేసుకోవడానికి కావలసినన్ని వనరులు ఉన్నాయి. పాలకుల్లో చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాంతాన్ని అద్భుతంగా తయారు చేసుకోవచ్చు. నాయకులు పట్టించుకోకపోవడం వల్లే పాతనగరం పేరుకు తగ్గట్లే పాతగా ఉండిపోయింది. విశాఖ తొలి నగరం అంటే ఇదే. ఇప్పుడు ఓల్డ్‌టౌన్‌గా మారిపోయింది.

– బాబ్జి, పాత నగరవాసి

### చక్కటి పర్యాటక ప్రాంతం..



నిజానికి విశాఖ చక్కటి పర్యాటక కేంద్రం. ముఖ్యంగా పాతనగరంలో చూడవలసిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకుంటే ఈ ప్రాంతాన్ని గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుకోవచ్చు. పోర్టు, హార్బర్, దర్గా వంటి ఎన్నో నిర్మాణాలున్న పాతనగరాన్ని అభివృద్ధి చేస్తే మంచి టూరిస్టు ప్లేస్‌గా మారుతుంది.

– రాజు, పాతనగరం,

### బొత్స ఎన్నికతో ఉత్తరాంధ్రకు న్యాయం



బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీ కావడంతో ఉత్తరాంధ్రకి న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఇకపై శాసన మండలిలో ఉత్తరాంధ్ర సమస్యల పట్ల ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ముఖ్య భూమిక పోషించనున్నారని చెప్పారు. శాసన మండలిలో ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న బొత్స సత్యనారాయణను వాసుపల్లి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ విశాఖ సమస్యల పట్ల అపార అనుభవం కలిగిన బొత్స సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ తరపున ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తారని నమ్మకం, పూర్తి విశ్వాసం ఉన్నాయన్నారు.

### సంస్కృత భాషా దినోత్సవం

సీతమ్మధార : బీవీకే కళాశాలలు, సంస్కృత భారతి సంయుక్తంగా ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో సంస్కృత భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా సంస్కృత భారతి విశాఖ జిల్లా అధ్యక్షుడు మహీధర నాగేశ్వరరావు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుమారి అనన్య సంప్రదాయ నృత్యంతోపాటు విద్యార్థుల గేయాలు, పుస్తక ప్రదర్శన, వస్తు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీవీకే విద్యా సంస్థల కోశాధికారి వై.శ్రీధర్, కళాశాల ఇన్‌చార్జి ఆర్.ఉమా సుందరి, ప్రిన్సిపాల్ టి.గోవిందరావు, సంస్కృత విభాగ అధ్యాపకులు ఎస్.ద్రాక్షాయని పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువుటద్దం కోటవురట్ల ఘటన

- ఆదివాసీ గిరిజన సంఘం విమర్శ



కేజీహెచ్ పిల్లల వార్డులో చిన్నారులను పరామర్శిస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు

మహారాణిపేట : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కోటవురట్ల ట్రస్టులో ఆదివాసీ చిన్నారులు మృత్తి చెందారని, ఈ సంఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కిముడు చిన్నంనాయుడు, గసాడి వెంకట రమణమూర్తి కోరారు. విషాహారం తిని అస్వస్థతకు గురై విశాఖ కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న వారిని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల బృందం బుధవారం పరామర్శించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ విద్యార్థులను దత్తత తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చిన్నంనాయుడు, ఏయూ గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు సింహాద్రి, సత్యనారాయణ, కోటిబాబు తదితరులు పిల్లలను పరామర్శించి గిరిజన బాలలకు అందుతున్న వైద్య సేవలపైన, మృతి చెందిన విద్యార్థుల వివరాలు, అస్వస్థతకు గల కారణాలు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత 13 సంవత్సరాలుగా ఎటువంటి అనుమతి లేకుండా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథాశ్రమం నడుపుతుంటే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. ఎంతో మంది ఏజెన్సీ విద్యార్థులు నర్సీపట్నం, ఎస్.కోట, చోడవరం, మాడుగుల నుంచి వచ్చి చదువుకుంటున్నారని అన్నారు. వీరికి పీవీటీజీ గురుకులంలో ప్రత్యేక అడ్మిషన్లు ఇవ్వాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## వానాకాలంలో..ఎండా కాలం

- మండుతున్న ఎండలు
- ఉక్కపోత.. చెమటతో ప్రజల విలవిల



జనసంచారం లేక బోసిపోయిన అల్లిపురం మెయిన్‌రోడ్డు



బోసిపోయిన చావులమదుం రోడ్డు



ఎండ తీవ్రతకు ముసుగేసుకుని ప్రయాణిస్తున్న వాహన చోదకులు



ఎండకు జనాలు లేని అల్లిపురం మార్కెట్ రోడ్డు

అల్లిపురం : వర్ష రుతువు వచ్చి మూడు నెలలైనా ఎండలు మండిస్తున్నాయి. తెలంగాణతో పాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. తెలంగాణలో అయితే క్లౌడ్ బరస్ట్‌తో కుండపోత వర్షాలు దంచి కొడుతున్నాయి. కానీ నగరంలో ఆ పరిస్థితి లేదు. ఒక రోజు మబ్బులుంటే రెండు రోజులు ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఒక ప్రాంతంలో వర్షం పడితే మరో ప్రాంతంలో ఎండలు కాస్తున్నాయి. మబ్బులు వేసినప్పటికీ చల్లదనం లేకపోగా ఉక్కపోత నగరవాసులను విలవిల్లాడిస్తోంది. బుధవారం నగరంలో ఎండ తీవ్రత 32 డిగ్రీలు ఉన్నప్పటికీ 42 డిగ్రీల్లా ఫీలయ్యారు. దీంతో నగరంలో రోడ్లన్నీ దాదాపు ఖాళీగానే కనిపించాయి. ప్రకాశరావుపేట, డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, అల్లిపురం, చావులమదుం ప్రాంతాలు జనసంచారం లేక బోసిపోయాయి. ఎండ తీవ్రతకు పాదచారులు, వాహన చోదకులు శీతల పానీయాలు, కొబ్బరి బోండాలను ఆశ్రయించారు. ఈ పరిస్థితి ఎన్నిరోజులుంటుందో అని నగరవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## కోల్‌కతా ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐడీఎస్‌వో ప్రతినిధులు



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ శ్రేణులు

డాబాగార్డెన్స్ : కోల్‌కతా మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యకు పాల్పడ్డ నేరస్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్‌వో నేతృత్వంలో విద్యార్థులు నిరసన తెలిపారు. ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఏఐడీఎస్‌వో నగర కమిటీ అధ్యక్షుడు కె. అభిలాష్, ఉపాధ్యక్షుడు బి. సంతోష్, సభ్యులు చరణ్, ప్రవీణ్, హర్షవల్లి, పౌర చైతన్య వేదిక నేత సీహెచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

**బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..**

కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై లైంగిక వేధింపులకు నిరసనగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో బుధవారం సంస్థ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిటు నాయకురాలు మణి మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాగర్, మీనాకుమారి, ఉమ, బుడ్డి దొర, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సీఐటీయూ ఆధ్వర్యంలో..**

సీతమ్మధార : జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుదారు. మహిళా చట్టాలు సక్రమంగా అమలు చేయలేని ప్రభుత్వాలు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఇక్కడ మానవహారం అనంతరం ఆశీలమెట్ట, గురజాడ విగ్రహం జంక్షన్, సెంట్రల్ పార్కు మీదుగా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆశ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఆర్‌పీ, సిటు నాయకులు ఎ.సీతాలక్ష్మి, ఎం.సుబ్బారావు, కుమారి, చంద్రమౌళి, శివ, రాజు, పి.వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### అక్రమ పొగాకు వ్యాపారం పెరగడం ఆందోళనకరం

డాబాగార్డెన్స్ : అక్రమ పొగాకు వ్యాపారం పెరగడంపై ఐపీఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవనీల్‌కర్ ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ వ్యాపారాన్ని నిర్మూలించేందుకు ఐపీఎం ఇండియా చాలా కాలంగా ప్రయత్నిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా అక్రమ వ్యాపారాన్ని నిరోధించేందుకు 5 కీలక రంగాలపై దృష్టి సారించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధన, మేధస్సు, సరఫరా గొలుసును రక్షించడం, భాగస్వామ్యాలు, చట్ట అమలుతో సహకారం, అవగాహన పెంచడం, స్వాధీనం చేసుకున్న ఉత్పత్తుల తనిఖీ, ప్రామాణీకరించడం, ఫోరెన్సిక్ మూల్యాంకాలను నిర్వహించడం ద్వారా చట్టాన్ని జారీ చేసే ఏజెన్సీలకు మద్దతుగా ఐపీఎం ఇండియా సహకరిస్తుందన్నారు. 2023–24లో విశాఖ మహా నగరంలో పోలీసులు, కస్టమ్స్ సంయుక్తంగా 21 లక్షలకు పైగా స్టిక్‌లు స్వాధీనం చేసుకోగా, విజయవాడలో 75 పెట్టెలతో సహా 103 లక్షల స్టిక్‌లు, హైదరాబాద్ పోలీసులు 267 డబ్బాలు, 4.5 లక్షల స్టిక్‌లను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

### చురుగ్గా యూజీడీ పనులు

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గతంలో కొన్ని వీధుల్లో మిగిలిపోయిన వాటిలో ఈ పనులు ప్రారంభించారు. పొక్లెయిన్లతో గోతులు తవ్వుతున్నారు. వాటిలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు వేస్తున్నారు. దీంతో కాలనీలో వీధులు ప్రస్తుతం గోతులమయంగా మారాయి. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హ్యాండ్‌బాల్ పోటీల విజేతలకు అభినందనలు



విద్యార్థులతో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతమ్మధార : సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. సత్యసాయి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు కదిరి పట్టణంలో నిర్వహించారు. అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో బుల్లయ్య డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఎల్.వెంకటేష్, ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆర్.నిఖిల్ విశాఖ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ మేరకు రేసపువానిపాలెంలో గల కళాశాలలో బుధవారం వీరిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ల ఆవరణలో చెట్ల తొలగింపు



చెట్లు కొట్టివేయడంతో సుందరంగా కనిపిస్తున్న ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్

సీతమ్మధార : నగరంలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో గల ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్ల ఆవరణలోని చెట్లు తొలగించడంతో సుందరంగా కనిపిస్తున్నాయి. ఇక్కడ రెండు పోలీసు స్టేషన్లలో శాంతి భద్రతలు, క్రైం, ట్రాఫిక్ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోలీస్ స్టేషన్లను తనిఖీ చేస్తూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో దట్టంగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, పలు చెట్లు తొలగించారు. దీంతో పోలీస్ స్టేషన్ లుక్ పూర్తిగా మారిపోయింది. స్టేషన్ ఆవరణలోని చెట్లు కారణంగా బోర్డులు కూడా గతంలో బయటకు కనిపించేవి కాదు. ప్రస్తుతం స్టేషన్ మొత్తం పూర్తిగా కనిపిస్తోంది. మరోవైపు స్టేషన్ లోపల ఫర్నిచర్, సామగ్రి, ఇతర వస్తువులు సక్రమంగా వుండేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద ఫిర్యాదుదారులకు సౌకర్యాలు మరింత మెరుగ్గా వుండేలా చర్యలు తీసుకున్నారు. రెండు స్టేషన్లలోనూ కేసుల వివరాలతో కూడిన బోర్డులను సీపీ ఆదేశాలతో ఏర్పాటు చేశారు.

## సమాజ హితంగా ఫొటోగ్రఫీ ప్రదర్శన



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

బీచ్‌రోడ్డు: వైజాగ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఫొటోగ్రఫీ ప్రదర్శన భావోద్వేగాన్ని కలిగిస్తోందని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ప్రదర్శనలోని ఫొటోలు సమాజ శ్రేయస్సుకు వారధిగా నిలిచాయని పేర్కొన్నారు. 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటోల ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఫొటో జర్నలిస్టులు తీసిన ఫొటోలు అందరినీ ఆకర్షిస్తూ సందేశాత్మకంగా, సమాచారపరంగా, సమాజ హితంగా ఉన్నాయని, వారి సృజనాత్మకత ప్రశంసనీయమన్నారు. ఒక్కో ఫొటో ప్రాముఖ్యాన్ని ఫొటో జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఈ ఫొటో ప్రదర్శనలో చాలా విషయాలు గమనించగలరన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో అవార్డులు పొందిన విశాఖ ఫొటో జర్నలిస్టులు పి.లీలామోహనరావు, ఎం.డి.నవాజ్(సాక్షి), పి.ఎస్.మూర్తి, కె.మురళీకృష్ణ (డెక్కన్ క్రానికల్), కె.ఆర్.దీపక్, వి.పి.రాజు (ది హిందూ), ఎస్.కనక, ఎ.శరత్‌కుమార్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), జి.సత్యనారాయణ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్), ఫ్రీ లాన్సర్ బలివాడ గోపీకృష్ణలను దుశ్శాలువాలతో కమిషనర్ సంపత్‌కుమార్ సత్కరించి అభినందించారు.

## జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కల్పించాలని వినతి



ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ కార్యదర్శులు

మహారాణిపేట : వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు జూనియర్ అసిస్టెంట్ క్యాడర్, గ్రామ పంచాయతీ సెక్రటరీల అధికారాలు కల్పించాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్టు గణేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ సందీప్‌కుమార్, అశోక్‌కుమార్, పైడిరాజు, సాయికృష్ణ, సురేంద్ర, రమేష్, 38వ వార్డు మాజీ కార్పొరేటర్, జనసేన నాయకుడు బి. ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.